


ప్రదర్శనల ఆర్భాటం వద్దు...
పారదర్శక బతుకే ముద్దు!

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 3 సంచిక -21 గురువారం 18 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## హర్మూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

**భారత నావికుల రక్షణ మాకు ముఖ్యం**

**హర్మూజ్‌పై ఆంక్షలు తొలగించడం ప్రపంచానికి అవసరం**

**ట్రంప్‌తో భేటీలో ప్రధాని మోడీ స్పష్టీకరణ**

**మోడీ తనకు మంచి మిత్రుడు అంటూ మరోమారు ట్రంప్ వ్యాఖ్య**




**ప్యారిస్,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);**హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, మిగతా2లో...

## ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

**ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం**

**● ఆ భావన నుంచి అంతా బయటపడితే మంచిది ● సర్కార్ బడుల నుంచే ఐఎఎస్,ఐపిఎస్‌లు వచ్చారు ● అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు ● కులమాతలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం ● ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్కూల్‌ను ప్రారంభించిన సిఎం రేవంత్**



**రంగారెడ్డి,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);**ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ. 15 కోట్లతో అంతర్జాతీయ మిగతా2లో...



## సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

**ప్రజలను మోసగించే వారు సమాజానికి చేటు**

**అలాంటివారు జైల్లో ఉండడమే కరెక్ట్**

**సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);**సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం. మిగతా2లో...

## నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

**- రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా బస్సు ప్రయాణం**

**- రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



**కరీంనగర్,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);**ఈనెల 21న నిర్వహించే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. మిగతా2లో...

## వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

**● అభిమాని చిన్నారి నిరంజన్‌కు పరామర్శ ● వైద్యం కోసం లక్ష రూపాయాల ఆర్థికసాయం ● భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు**



**వరంగల్,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);**ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అభిమాని నిరంజన్ (17)ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరామర్శించారు. బుధవారం హనుమకొండ, హనుమాన్ నగర్‌లోని బాలుడి ఇంటికి వెళ్లారు. బాలుడితో కొద్దిసేపు ముచ్చటించారు. నిరంజన్ కుటుంబానికి పవన్ భరోసా ఇచ్చారు. నిరంజన్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష ఆర్థిక సాయం అందించారు. చిన్ననాటి నుంచి మీరంటే ప్రాణం అని చెప్పిన నిరంజన్ మాటలకు పవన్ చలించి పోయారు. నిరంజన్‌ను హత్తుకుని ముద్దాడారు. తను ఆరోగ్యంగా ఉన్న సమయంలో పవన్ పాటలకు వేసిన డాన్స్‌ల వీడియోలను నిరంజన్.. పవన్‌కు చూపించారు. తిరుమల నుంచి తెప్పించిన వస్త్రాన్ని నిరంజన్‌కు అందించారు. భద్రకాళి ఆలయంలో పూజ చేయించిన అమ్మవారి వెండి ప్రతిమను నిరంజన్ తల్లిదండ్రులకు అందజేశారు. ఇక, పవన్ పర్యటన నేపథ్యంలో అభిమానులు పెద్ద సంఖ్యలో బాలుడి ఇంటి దగ్గరికి చేరుకున్నారు. కాగా, నిరంజన్‌కు చిన్నప్పటి నుంచి పవన్ అంటే ప్రత్యేక అభిమానం. ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న అతడు తన అభిమాన హీరో మిగతా2లో...

## రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

**- వారు ఆర్థికంగా ఎదగాలన్న దిశగా కృషి**

**- పేదలు సన్నబియ్యం తినాలి..రైతులు ఆర్థికంగా ఎదగాలి**

**- సన్నరకాలను పండించేలా రైతు కమిషన్ సిఫారసు**

**- కేబినేట్ సబ్ కమిటీలో చర్చించినట్లు భట్టి విక్రమార్క వెల్లడి**



**హైదరాబాద్,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);**రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు వేయాలని సూచించారు. పేదలు సన్నబియ్యం తినాలని.. రైతులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. సచివాలయంలో భట్టివిక్రమార్క అధ్యక్షతన బుధవారం కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. ఈ భేటీకి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోళ్లు, మిగతా2లో...



## టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

**కేంద్రం తీరుపై మండిపడ్డ రాహుల్, కేజ్రీవాల్**

**న్యూఢిల్లీ,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);**నీట్-యూజీ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా నిషేధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వివాదాన్ని రేకెత్తించింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సహా ప్రతిపక్ష నాయకులు ఈ చర్యను తీవ్రంగా విమర్శించారు. 'ఈ చర్య నిజంగా పేపర్ లీక్‌లను నిరోధిస్తుందా' అని వారు సందేహాలు వ్యక్తం చేశారు. మిగతా2లో...

## రాష్ట్రంలో సంక్షేమం లేదు.. అంతా సంక్షోభమే...

**● దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది ● జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా అభివృద్ధి సున్నా... ● ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కెసిఆర్ మళ్లీ సిఎం ● సర్‌పై కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాల్సిందే ● పాలేరు నియోజకవరగ్గ బూత్ కార్యకర్తల భేటీలో కెటిఆర్**



**ఖమ్మం,జూన్ జూన్ 17(జర్నలిస్ట్ వార్త);)** రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది మిగతా2లో...



## రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

**- 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన**

**- గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);**ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై మిగతా2లో...

## సర్‌తో ముస్లిం ఓట్ల తొలగింపు కుట్ర

**బెంగాల్, బాహార్‌లే ఇందుకు నిదర్శనం**

**మీడియాతో మంత్రి అజారుద్దీన్ వ్యాఖ్య**



**హైదరాబాద్,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);**'సర్' ప్రక్రియతో ముస్లింల ఓట్లను తొలగించే అవకాశముందని తెలంగాణ మంత్రి అజారుద్దీన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. 'సర్' అందరి అంశమైనా.. ముస్లింల ఓట్లనే టార్గెట్ చేస్తారని ఆరోపించారు. పశ్చిమబెంగాల్, బిహార్‌లో ముస్లింల ఓట్లు తొలగించి బీజేపీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. మిగతా2లో...

అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..



# హర్మ్యూజ్‌లో ఆంక్షలు ఉండరాదు

(మొదటి పేజీ తరువాయి)

వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మ్యూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు కృషి చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్‌నకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురి నేతల మధ్య కీలక సంభాషణ జరిగింది. ట్రంప్‌తో ప్రధాని మోదీ ఇలా అన్నారు.. 'ప్రపంచానికి హార్ముజ్‌ను తెరవడం అత్యవసరం. సముద్రయాన స్వేచ్ఛను కచ్చితంగా కాపాడాలని.. దానిపై మనం ప్రత్యేక దృష్టి సారించాలని మేము ఎప్పుడూ చెబుతూనే ఉన్నాం. సముద్ర వాణిజ్య రంగంలో లక్షలాది మంది భారతీయ నావికులు ప్రపంచవ్యాప్తంగా వివిధ సముద్రాల్లో విధుల్లో ఉన్నారు. ఇది చాలా ముఖ్యమని నేను భావిస్తున్నాను? ఒప్పందంలో నావికుల భద్రతకు భరోసా లభిస్తుందని.. వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని నాకు నమ్మకం ఉందని అన్నారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. 'ఫ్రాన్స్‌లో మాకు కొన్ని అద్భుతమైన సమావేశాలు జరిగాయి. ముఖ్యంగా భారత ప్రధాని మోడీతో చాలా మంచి చర్చలు జరిగాయి. మేము వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటున్నాం. అమెరికా-భారతదేశం మధ్య చాలా విషయాలు జరుగుతున్నాయి. అమెరికా అత్యుత్తమ స్థితిలో ఉంది. మా ఆర్థిక వ్యవస్థ 19.2 ట్రిలియన్ డాలర్లకు పైగా స్థాయికి చేరుకుంది. మేము కర్మాగారాలను, మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నాం. ప్రధాని మోడీ అమెరికాలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. అక్కడ చాలా ఖర్చు చేస్తున్నారు. ఆ కృషిని మేము అభినందిస్తున్నాం. మోడీ నాకు చాలా కాలంగా మిత్రుడు. మా మధ్య ఎప్పుడూ గొప్ప సంబంధం ఉంది. మీతో కలిసి ఉండటం చాలా సంతోషంగా ఉందని ట్రంప్ పేర్కొన్నారు. నాకు భారతదేశం పట్ల చాలా గౌరవం ఉంది. మోడీ ఉన్నంతకాలం భారతదేశం పోషించాల్సిన పాత్ర చాలా ఉంది. మోడీ ఎప్పుడూ ప్రశాంతంగా కనిపిస్తారు. కానీ చాలా గట్టి మనిషి అంటూ అభినందించారు.

# వరంగల్ పర్యటనలో పవన్ కళ్యాణ్

(మొదటి పేజీ తరువాయి)



పవన్ కళ్యాణ్‌ను కలవాలన్న కోరికను కుటుంబసభ్యులతో వెలిబుచ్చాడు. ఈ విషయం పవన్ వరకు వెళ్లింది. ఆయన తన అభిమాని కోసం హనుమకొండకు వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన అభిమానిని కలిశారు. అతడికి చెప్పలేనంత సంతోషాన్ని అందించారు. జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ అనే బాలుడు తనకు అభిమాని అని, తనను కలవాలన్న అతడి ఆకాంక్షను తెలుసుకున్న పవన్.. ఉదయం నేరుగా బాలుడి నివాసానికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. తన పర్యటనకు సంబంధించిన ఫొటోలతో 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. కొద్ది రోజుల క్రితం వరంగల్ జిల్లా హనుమకొండకు చెందిన నిరంజన్ అనే యువకుడు అరుదైన వ్యాధితో పోరాడుతూ నన్ను కలవాలనే ఆకాంక్షను వ్యక్తం చేసిన వీడియోను చూశాను. నిరంజన్ ఆకాంక్షను నెరవేర్చాలని భావించాను. ఈరోజు హనుమకొండలోని అతని నివాసానికి వెళ్లి పరామర్శించాను. అరుదైన వ్యాధితో చేస్తున్న పోరాటంలో అతడి అసాధారణ ధైర్యం, ఆత్మవిశ్వాసం, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న తీరు స్ఫూర్తిదాయకం. తీవ్రమైన అనారోగ్య సమస్యల మధ్య నిరంజన్ చూపుతున్న మనోధైర్యం ప్రశంసనీయం. నిరంజన్ సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ ఆ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించాను. భద్రకాళి అమ్మవారి ఆశీస్సులు అతనిపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నాను. భగవంతుని ఆశీస్సులతో నిరంజన్ త్వరగా కోలుకోవాలి. ప్రియమైన నిరంజన్.. నీ ధైర్యం నీ కష్టాలకంటే గొప్పది. త్వరలో నిన్ను సంపూర్ణ ఆరోగ్యంతో, చిరునవ్వుతో, మరింత ఉత్సాహంగా చూడాలని కోరుకుంటున్నాను అని పేర్కొన్నారు. అదే సమయంలో వరంగల్, హనుమకొండ పర్యటనకు పూర్తి సహాయ సహకారాలు అందించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ శాఖకు కృతజ్ఞతలు. తెలంగాణ ప్రజలు నాపై చూపిస్తున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు. తెలంగాణ ప్రజల ఆశీర్వాదాలు, ప్రేమ నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయి. నాపై మీ మమకారాన్ని జీవితాంతం నా హృదయాం తరాల్లో నిలుపుకొంటాను' అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపించి దాన్ని పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని పవన్ హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్‌ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్‌లో పని చేసేవాళ్లమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నేతలకు సూచించారు. నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయన వెంట జనసేన నేతలు శంకర్ గౌడ్, శ్రీరామ్ తాళ్లూరి, రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ కాదు

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు.

# రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నిల్వ సదుపాయాలపై ఈ సమీక్షలో చర్చించామని తెలిపారు. నాణ్యమైన వరి రకాల సాగుకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తామని మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. తెలంగాణ సోనామసూరికి సంబంధించి వివిధ రకాలపై ఫోకస్ పెట్టామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ ఉన్న పంటలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పుకొచ్చారు. బాయిల్డ్ రైస్ కొనుగోళ్లు నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర విధానాలతో తెలంగాణ రైతాంగం నష్టపోతోందని భట్టి విక్రమార్క విమర్శించారు. గ్రామగ్రామాన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని రైతు కమిషన్ తెలిపింది. మేలుజాతి వంగడాలతో రైతుల ఆదాయం పెరుగుతుందని వ్యవసాయ కమిషన్ సూచించింది. రాబోయే సీజన్లలో నాణ్యమైన వరి రకాల సాగు విస్తరణ లక్ష్యమని పేర్కొంది. ఎఫ్‌సీఐ కొనుగోళ్లు తగ్గించడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని వ్యవసాయ కమిషన్ అభిప్రాయపడింది. రైతాంగాన్ని అదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. బిపిటి 5204, తెలంగాణ సోనా జై శ్రీరామ్, హెచ్‌ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమిషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది.

# రాష్ట్రంలో సంక్షేమం లేదు..అంతా సంక్షోభమే...

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమీషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ పక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు.

# సైబర్ నేరస్థులు పరాన్న జీవులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేడాది చివరి నాటికి దేశం లో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఔఅఖీః) గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# టెలిగ్రామ్ యాప్ నిషేధం బుర్రతక్కువ పని

(మొదటి పేజీ తరువాయి)

పరీక్షా పేపర్ లీక్‌లను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు 'పేపర్ లీక్ మాఫియాపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, టెలిగ్రామ్‌ను నిషేధించారు. ఇది సమస్యకు పరిష్కారం కాదు. దొంగలను పట్టుకోలేక, బాధితుల తలుపులకు తాళం వేస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఏళ్లుగా టెలిగ్రామ్‌ను ఉపయోగిం చుకుని నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, డిస్కషన్‌లతో చదువుకుంటున్నారు. ఆ సౌకర్యాన్ని లాక్కోవడం పేపర్ లీక్‌లకు పరిష్కారం ఎలా అవుతుంది' అని సోషల్ మీడియా ద్వారా రాహుల్ విమర్శించారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ అంశంపై స్పందించారు. 'ఈ రోజు టెలిగ్రామ్‌ను నిషేధించారు. రేపు వాట్సాప్‌ను కూడా నిషేధిస్తారా?' అంటూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించారు. మరోవైపు ఈ నిషేధాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్, ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ కూడా ఈ చర్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది 15 కోట్లకు పైగా భారతీయ వినియోగదారులను శిక్షించడమే. ఈ చర్య అసలు లీక్‌లను ఆపదు' అని వ్యాఖ్యానించారు.

# నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నారు. రవాణా కోసం విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. బుధవారం మంత్రులు లక్ష్మణ్ కుమార్, పొన్నం ప్రభాకర్ మానకొండూరు మండలం తిమ్మాపూర్ నుంచి కరీంనగర్ వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో ఉద్యోగాల సంఖ్య పెంచామని, ఆర్టీసీ కార్మికులకు అన్ని వసతులు కల్పించే విధంగా కృషి చేస్తున్నామని మంత్రి పొన్నం వివరించారు. ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసేందుకు ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశామని గుర్తు చేశారు. ఆర్టీసీలో మరిన్ని సేవలను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈనెల 21న జరిగే నీట్ పరీక్షలకు ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.

# రెండోవిడతలో గుడిసువాసులకు ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్దిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు. బీఎల్‌సీ విధానంలో నిర్మాణాలు చేపడతామని పేర్కొన్నారు. పట్టణాల్లో అవసరమైతే జీ ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతి ఇస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు.

# సర్‌తో ముస్లిం ఓట్ల తొలగింపు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలోనూ అలాంటి కుట్రలకు పాల్పడే ఛాన్స్ ఉందని ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మంత్రి అజారుద్దీన్ మాట్లాడారు. 'సర్' అంశంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరి ఓటుని వాళ్లే కాపాడుకునే బాధ్యత తీసుకోవాలని సూచించారు. 'సర్'లో తొలగించే ఓట్లతో గెలుపు, ఓటములు ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. తాను ఎప్పుడూ మాట్లాడినా.. నిజాయితీగా మాట్లాడుతానని మంత్రి అజారుద్దీన్ తెలిపారు. తనకు తెలుగు రాయడం, చదవడం వచ్చు అని వివరించారు. తెలుగులో మాట్లాడటం మాత్రం కొంత ఇబ్బందిగా ఉంటుందని అన్నారు. చిన్నప్పుడు తెలుగులో రాయడం, చదవడం ప్రాక్టీస్ చేసేవాడినని తెలిపారు. తెలుగులో మాట్లాడితే తప్పులు పోతే కొంత ఇబ్బందిగా ఉంటుందని చెప్పారు. తనకు సులువుగా ఉండే భాషలోనే తాను మాట్లాడుతానని అన్నారు. తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అనవసరపు విమర్శలు చేస్తూనే ఉంటాయని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో అద్భుతమైన పాలన అందిస్తున్నామని వ్యాఖ్యానించారు. విద్యారంగంపై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని మంత్రి ఉద్ఘాటించారు. కేసీఆర్ హయాంలో పెండింగ్‌లో పెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ని తమ ప్రభుత్వం చెల్లిస్తోందని స్పష్టం చేశారు. తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చాలామంది పేదలకు సాయపడ్డానని.. పలు సమస్యలు పరిష్కరించానని తెలిపారు. తనకు పబ్లిసిటీపై మోజు లేదని అన్నారు. 200 మందికి పైగా ఆయా సమస్యలు పరిష్కరించాలని తనకు దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించానని మంత్రి అజారుద్దీన్ పేర్కొన్నారు.

# సిఎం రేవంత్‌తో ఈషాసింగ్ భేటీ



**హైదరాబాద్,జూన్ 17(జర్నలిస్ట్ వార్త);** మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ క్రీడాకారిణి, అర్జున అవార్డు గ్రహీత ఈషా సింగ్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఇటీవల జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ (రైఫిల్/పిస్టల్) 2026 పోటీల్లో స్వర్ణం సాధించి ప్రపంచ రికార్డు కైవసం చేసుకున్న నేపథ్యంలో ఈషా సింగ్ ని సిఎం రేవంత్ అభినందించి, సత్కరించారు.

# ఎన్ఎస్‌పీ కాలువ దుస్థితి..

## చెత్తతో నిండి రైతులకు శాపం



**తల్లాడ,/ జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):**
తల్లాడ మండలం రేజర్ల పంచాయతీ పరిధిలోని సిరిపురం మేజర్ ఎన్ఎస్‌పీ కాలువ దుస్థితి రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కాలువలో చెత్తాచెదారం, రేకులు, ప్లాస్టిక్ డబ్బాలు, ఇతర వ్యర్థ పదార్థాలు పేరుకుపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా అడ్డంకులు ఎదుర్కొంటోంది.కాలువలో నీటి ప్రవాహానికి ఏర్పాటు చేసిన బొంగలు సైతం చెత్తలో కూరుకుపోయి కనిపించని స్థితికి చేరాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో కాలువలు మూసుకుపోవడం వల్ల మురుగునీరు పొలాల్లోకి చేరి పంటలకు నష్టం జరిగే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.గ్రామంలో పరిశుభ్రత, అభివృద్ధి గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ, కాలువల నిర్వహణ విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. "మన ఊరు మన గ్రామం" అనే నినాదం కేవలం చెప్పుకోవడానికే పరిమితమైందా అని ప్రశ్నిస్తున్నారు.ప్రతి ఏడాది కాలువల నిర్వహణకు నిధులు కేటాయిస్తున్నప్పటికీ, పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్, పంచాయతీ శాఖ అధికారులు స్పందించి జేసీబీలతో కాలువలో పేరుకుపోయిన చెత్త, పూడికను తొలగించి నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.లేనిపక్షంలో సాగునీరు అందక పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే చర్యలు చేపట్టి గ్రామాలను, రైతులను ఆదుకోవాలని అధికారులను కోరుతున్నారు.

# మోకాలి చికిత్సకు రూ.75 వేల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



**ధర్మసాగర్ /హనుమకొండ, బ్యూరో జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన గంటే పెద్దపురం మోకాలి మార్పిడి (క్నీ రీప్లేస్‌మెంట్) చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరగా, చికిత్సకు భారీ మొత్తంలో ఖర్చు అవసరమైంది. ఈ విషయాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా రూ.75 వేల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు చేయించి బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించారు. బుధవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎల్ఓసీ పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తమ ఆర్థిక ఇబ్బందులను గుర్తించి తక్షణమే స్పందించి సహాయం అందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుతున్న సాయాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిపారు.

## ఎల్కతుర్తి కేజీబీవీలో గెస్ట్ అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**ఎల్కతుర్తి/, జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) జూనియర్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి నర్సింగ్ విభాగంలో బోధన నిర్వహించేందుకు గెస్ట్ అధ్యాపకులను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ పి. అనితాదేవి తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో పాటు అవసరమైన పత్రాలను ఈ నెల 18 నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఎల్కతుర్తి కేజీబీవీ జూనియర్ కళాశాలలో సమర్పించాలని సూచించారు.హనుమకొండ జిల్లా పరిధిలో నివసించే మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆమె పేర్కొన్నారు. అర్హత, అనుభవం మరియు నిబంధనల ప్రకారం ఎంపిక ప్రక్రియ నిర్వహించబడుతుందని తెలిపారు.అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పి. అనితాదేవి కోరారు.

# 14 ఏళ్ల తర్వాత మళ్లీ మోగిన బడి గంట

**నర్సింగరావుపల్లిలో ప్రభుత్వ పాఠశాల పునఃప్రారంభం -విద్యాభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి : ఎమ్మెల్యే కడియం శ్రీహరి**









**ధర్మసాగర్, /హనుమకొండ బ్యూరోజూన్ 17 (జర్నలిస్ట్ వార్త):**ధర్మసాగర్ మండలం నర్సింగరావుపల్లి గ్రామంలో 14 సంవత్సరాల క్రితం మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బుధవారం మళ్లీ విద్యార్థుల సందడితో కళకళలాడింది. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాఠశాల పునఃప్రారంభోత్సవంతో పాటు ప్రీ-ప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు.
విద్యార్థులతో కలిసి రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే పాఠశాల ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు పంపిణీ చేశారు. అంతకుముందు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. "నియోజకవర్గంలో ఒక్క ప్రభుత్వ పాఠశాల కూడా వసతులు లేక, ఉపాధ్యాయులు లేక మూతపడకూడదు" అని స్పష్టం చేశారు. విద్యాశాఖ అధికారులు, గ్రామ ప్రజల సహకారంతోనే 14 ఏళ్లుగా మూతపడ్డ పాఠశాలను తిరిగి ప్రారంభించగలిగామని తెలిపారు.
నర్సింగరావుపల్లి పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధన అందించనున్నట్లు వెల్లడించారు. పాఠశాలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించే బాధ్యత తనదేనని, గ్రామస్తులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు.
ఉపాధ్యాయులు పాఠశాలను తమ సొంత ఇల్లుగా భావించి పనిచేయాలని, విద్యాబోధనలో తల్లిదండ్రులకు పూర్తి నమ్మకం కలిగించే విధంగా వ్యవహరించాలని సూచించారు. నర్సింగరావుపల్లి పాఠశాలను మోడల్ స్కూల్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఆట వస్తువులు కూడా అందజేస్తామని హామీ ఇచ్చారు.త్వరలో నారాయణగిరిలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రారంభం కానుందని, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే క్రీడా పాఠశాల, క్రికెట్ స్టేడియం కూడా మంజూరైనట్లు వెల్లడించారు.కార్యక్రమంలో సర్పంచ్ శిభారాణి కుమారస్వామి, డీఈవో, ఎంఈవో, తహసీల్దార్, ఎంపీడీవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# దేవునూర్‌లో ఆర్థిక అక్షరాస్యత సదస్సు

**డిజిటల్ బ్యాంకింగ్ సేవలపై అవగాహన**



**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూన్ 17 (జర్నలిస్ట్ వార్త)**వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) ధర్మసాగర్ శాఖ ఆధ్వర్యంలో దేవునూర్ గ్రామంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యత, సాంకేతిక అక్షరాస్యత సదస్సు నిర్వహించారు. నాబార్డ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులకు బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డీసీసీ బ్యాంకు శాఖ మేనేజర్ ఆర్. వెంకటేష్ మాట్లాడుతూ బ్యాంకు అందిస్తున్న 'రాణి రుద్రమదేవి డిపాజిట్ స్కీమ్' కింద గరిష్ఠంగా 8.10 శాతం వడ్డీ లభిస్తోందని తెలిపారు. రైతులు, మహిళలు, పొదుపుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.
అలాగే బర్రెలు, గొర్రెలు, ట్రాక్టర్లు, హార్వెస్టర్ల కొనుగోలుకు దీర్ఘకాలిక రుణాలు, గృహ నిర్మాణ రుణాలు, విద్యా రుణాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, లాకర్ సదుపాయాల ద్వారా వినియోగదారులు సులభంగా బ్యాంకింగ్ సేవలు పొందవచ్చన్నారు.డిజిటల్ లావాదేవీలతో సమయం, ఖర్చు ఆదా అవుతుందని, గ్రామీణ ప్రాంత ప్రజలు కూడా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు.కార్యక్రమంలో డీసీసీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ రెడ్డి, దేవునూర్ సర్పంచ్ హింగే రవీందర్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ధర్మసాగర్ పీఏసీఎస్ సిబ్బంది ఆవుల కుమారస్వామి, బొడ్డు ప్రభుదేవ్, కలకోటి మురళీకృష్ణ, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కన 'గోపి నగర్' బోర్డు కలకలం

**సర్పంచ్, కార్యదర్శికి గ్రామస్తుల ఫిర్యాదు.. ధర్మసాగర్‌లో ఉద్రిక్తత**






**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో జూన్ 17 (జర్నలిస్ట్ వార్త)**ధర్మసాగర్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన 'గోపి నగర్' బోర్డు కొత్త వివాదానికి తెరలేపింది. ప్రభుత్వ ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా బోర్డు ఏర్పాటు చేశారంటూ కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.గ్రామస్తుల కథనం ప్రకారం.. ఒక కాలనీకి పేరు నిర్ణయించడం, బోర్డు ఏర్పాటు చేయడం వంటి అంశాలకు గ్రామపంచాయతీతో పాటు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరి. అయితే నిబంధనలను పక్కనపెట్టి ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో, అలాగే స్నేహ కాలనీలో 'గోపి నగర్' పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారని ఆరోపిస్తున్నారు.
ప్రభుత్వ ఆస్తుల పక్కన అనుమతులు లేకుండా బోర్డులు ఏర్పాటు చేయడం సరైన విధానం కాదని, వెంటనే వాటిని తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ అంశం గ్రామంలో తీవ్ర చర్చకు దారితీయగా, రెండు వర్గాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.బోర్డులను తొలగించడంలో అధికారులు ఆలస్యం చేస్తే గ్రామంలో ఘర్షణాత్మక పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితి అదుపు తప్పకముందే అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**కార్యదర్శి స్పందన కరువు**

ఈ వ్యవహారంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా, "రేపు మాట్లాడతాను" అని చెప్పి ఫోన్ పెట్టేశారు దీంతో ఈ వివాదంపై అధికారుల వైఖరి ఏమిటన్నది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

# ప్రదర్శనల ఆర్భాటం వద్దు... పారదర్శక బతుకే ముద్దు!

**ఆడంబరాల వేటలో అసలు సిసలైన మనుషులని కోల్పోతున్న ఆధునిక సమాజం**



నేటి యాంత్రిక జీవనంలో మనుషులు జీవించడం కంటే, పక్కవారికి తాము ఎంత వైభవంగా బతుకుతున్నామో చూపించుకోవడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. సమాజంలో గుర్తింపు, గౌరవం కేవలం సిరిసంపదలను బట్టే వస్తాయనే అపోహలో కొందరు కొట్టుమిట్టాడుతున్నారు. ఇతరులను మెప్పించడానికి, సమాజంలో తమ స్థాయిని పెద్దగా చూపించుకోవడానికి లేని సంపద ఉన్నట్టుగా నటించడం నేడు ఒక సామాజిక జాడ్యంగా మారింది. ఖరీదైన దుస్తులు, విలాసవంతమైన కార్లు, ఆర్భాటాల జీవనశైలిని ప్రదర్శిస్తూ. తమను తాము ఒక మిథ్యా ప్రపంచంలో బంధించుకుంటున్నారు. అయితే, ఈ కృత్రిమ వైభవం తాత్కాలిక మెరుపులను ఇవ్వగలదేమో కానీ, శాశ్వతమైన ఆత్మసంతృప్తిని, నిజమైన బంధాలను ఎన్నటికీ అందించలేదు. ధనవంతుడిగా నటించే వ్యక్తి చుట్టూ చేరేవారు ఆ వ్యక్తిని చూసి రారు, అతని వద్ద ఉన్న సంపదను, ఆ హోదాను చూసి వస్తారు. ఆ ముసుగు తొలగిపోగానే ఆ బంధాలూ కరిగిపోతాయి. మరి సమాజంలో మనుషుల నిజమైన మనసును, వారి యథార్థ రూపాన్ని తెలుసుకోవడం ఎలా? దానికి ఉన్న ఏకైక మార్గం ఆడంబరాలు లేని ఒక సాధారణ వ్యక్తిలా జీవించడం. ఎప్పుడైతే మనం ఎలాంటి అహాలు, ముసుగులు లేకుండా సాదాసీదాగా బతుకుతామో, అప్పుడు మన చుట్టూ ఉన్నవారి అసలు రంగు బయటపడుతుంది. మనం సాధారణ స్థితిలో ఉన్నప్పుడు కూడా మనల్ని గౌరవించి, మనతో స్నేహాన్ని కోరుకునేవారే నిజమైన మనుషులు.

**బాహ్య సౌందర్యం, ఆస్తిపాస్తులు కళ్లను మాత్రమే మెప్పిస్తాయి... కానీ నిరాడంబరత, గుణశీలతలు మాత్రమే హృదయాలను గెలుచుకుంటాయి.**

సరళమైన జీవన విధానం మనిషికి ఎనలేని స్వేచ్ఛను ఇస్తుంది. ఎవరినో మెప్పించాలనే తాపత్రయం లేనప్పుడు జీవితంలో ఒత్తిడి ఉండదు. ఎదుటివారి మనసుల్లో మన స్థానమేమిటో స్పష్టంగా అర్థమవుతుంది. మహానుభావుల జీవితాలను పరిశీలిస్తే వారిలో కనిపించే ఉమ్మడి సూత్రం నిరాడంబరత్వమే. వారు సమాజాన్ని చదవడానికి, ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించడానికి సాధారణత్వాన్ని ఒక ఆయుధంగా మలుచుకున్నారు. ఇకనైనా బాహ్య ప్రదర్శనల ఆర్భాటాన్ని వీడుదాం. సంపన్నుడిలా నటించే కృత్రిమ బతుకు కంటే, యథార్థంగా బతికే సాధారణత్వంలోనే ఎంతో గంభీరత ఉందనే సత్యాన్ని గ్రహిద్దాం. ముసుగులు లేని జీవితాన్ని అలవర్చుకుని, నిజమైన మనుషులను, నిఖార్సైన బంధాలను గుర్తిస్తూ సమాజాన్ని మరింత ఆరోగ్యకరమైన దిశగా నడిపిద్దాం.



సీనియర్ జర్నలిస్ట్ బిర్రు కరుణాకర్
సెల్ నంబర్ 9701249103

# ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పుస్తకాల పంపిణీ చేసిన సర్పంచ్ బొల్లి జయంతి వెంకటకృష్ణ.




**బయ్యారం/,జూన్ 17.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం జగ్గుతండ గ్రామపంచాయతీ పరిధిలోని బీసీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యా సంవత్సరానికి శ్రీకారం చుడుతూ పాఠశాలలో జాయిన్ అయినా విద్యార్థిని విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయడంతో పాటు విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం అందించే పుస్తకాలను సర్పంచ్ బొల్లి జయంతి వెంకట కృష్ణ చేతిలో మీద పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కవిత,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ సరస్వతి,ఉపాధ్యాయులు, రవీందర్,పద్మ,అంగన్వాడి టీచర్ ముకుందా,అంగన్వాడి ఆయ బుల్లి, పేరెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

# నెహ్రూ విగ్రహంపై వివాదం

## గేటు నిర్మాణంతో రగులుకున్న భిన్నాభిప్రాయాలు

**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):** ధర్మసాగర్ మండల కేంద్రంలోని చారిత్రక నెహ్రూ విగ్రహం చుట్టూ వివాదం రాజుకుంది. సుమారు 80 నుంచి 90 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విగ్రహం ముందు ఓ వ్యక్తి గేటు నిర్మించడంతో గ్రామంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారం ప్రస్తుతం గ్రామంలో చర్చనీయాంశంగా మారి ఉద్రిక్త వాతావరణానికి దారితీస్తోంది.

విగ్రహానికి ఎదురుగా గేటు ఏర్పాటు చేయడాన్ని కొందరు గ్రామస్థులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన నెహ్రూ విగ్రహం గౌరవానికి భంగం కలిగేలా చర్యలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. మరికొందరు మాత్రం గేటు నిర్మాణంలో ఎలాంటి అభ్యంతరం లేదని


గ్రామపంచాయతి కార్యాలయము దర్మసాగర్
మం:ధర్మసాగర్ - జిల్లా:హనుమకొండ
తే:15.06.2026
ఆర్.సి.నెం. 136/ధ/జి/2026
నోటీసు

వాదిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెహ్రూ విగ్రహాన్ని యథాతథంగా కొనసాగించాలని గ్రామ పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో గ్రామంలో నోటీసులు అంటించినట్లు సమాచారం. దీంతో విగ్రహం భవితవ్యంపై గ్రామంలో చర్చ మరింత వేడెక్కింది. చారిత్రక గుర్తింపుగా నిలిచిన విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగిస్తారా? లేక ఉన్నచోటే కొనసాగిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. వివాదం మరింత ముదరకుండా అధికారులు, పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**కార్యదర్శి స్పందన ఇదే..**

ఈ అంశంపై ధర్మసాగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్‌ను వివరణ కోరగా, "ఈ విషయంపై రేపు మాట్లాడతాను" అని చెప్పి ఫోన్‌ను ముగించారు



# ధర్మసాగర్‌కు కొత్త బస్సు.. ప్రజల కల సాకారం







**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూన్ 17జర్నలిస్ట్ వార్త)** ఎన్నో ఏళ్లుగా రవాణా సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న ధర్మసాగర్ మండల ప్రజల నిరీక్షణకు తెరపడింది. ధర్మసాగర్ నుంచి హనుమకొండ వరకు కొత్త బస్సు సర్వీసులను బుధవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా బస్సుకు పూజలు నిర్వహించి సర్వీసులను ప్రారంభించారు. ధర్మసాగర్ఉనికిచెర్లలంబాడి తండావడ్డేపల్లి మీదుగా హనుమకొండ బస్టాండ్ వరకు బస్సు నడవనుంది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, వైద్య సేవల కోసం హనుమకొండకు వెళ్లే ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా మాట్లాడుతూ, మండల ప్రజల విజ్ఞప్తి మేరకు రవాణా సమస్యను ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన చొరవతో కొత్త బస్సు సర్వీసులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ సర్వీసులు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

బస్సు సౌకర్యం అందుబాటులోకి రావడంతో విద్యార్థులు, మహిళలు, వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యను గుర్తించి పరిష్కరించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోడ్డుపై కంకర రాళ్లు.. యువకుడి ప్రాణం బలి

## మధిర ట్యాంక్‌బండ్‌పై ఘోర ప్రమాదం.. ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

**మధిర,/ జూన్ 17 ( జర్నలిస్ట్ వార్త):**

మధిర పట్టణంలోని చెరువు కట్ట (ట్యాంక్‌బండ్)పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది.

మధిర మున్సిపాలిటీ 3వ వార్డు అంబారుపేట గ్రామానికి చెందిన ఉపేందర్ (35) మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ స్కిడ్ అయింది. ఈ ప్రమాదంలో ఉపేందర్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఉపేందర్ చేపల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు పిల్లలు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాద స్థలంలో రోడ్డుపై కంకర, చిన్న రాళ్లు చెల్లాచెదురుగా ఉండటంతో స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఉన్న కంకర కారణంగానే బైక్ అదుపుతప్పి స్కిడ్ అయి ప్రమాదం జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే రోడ్డుపై ఉన్న కంకర మున్సిపాలిటీ పనుల కారణంగా వచ్చిందా? లేక ప్రైవేట్ నిర్మాణ పనుల వల్ల పడిందా?



అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారే విధంగా రహదారులపై కంకర, రాళ్లు వదిలేయడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు, ప్రమాదానికి గల అసలు కారణాలను వెలికితీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు భద్రత విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



# పారిశుద్ధ్య పనులను పరిశీలించిన డీపీఓ టి. రాంబాబు

## గ్రామంలో పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన

**తల్లాడ, /జూన్ 17 (జర్నలిస్వార్త):**

ఖమ్మం జిల్లా పంచాయతీ అధికారి టి. రాంబాబు బుధవారం తల్లాడ మండలంలోని కుర్నవల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామంలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాల అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించిన డీపీఓ, వైద్యాధికారి మరియు పారామెడికల్ సిబ్బంది అందిస్తున్న సేవలను అభినందించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యం, ఆరోగ్య పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పరిశుభ్రత కార్యక్రమాలను మరింత ముమ్మరం




చేయాలని అధికారులకు ఆదేశించారు.

ఇదిలా ఉండగా, కుర్నవల్లి గ్రామానికి చెందిన పాగా జోజి గత రెండు నెలలుగా జ్వరం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతూ ఖమ్మం, హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూన్ 16




తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. గాంధీ ఆసుపత్రి జారీ చేసిన మరణ ధృవీకరణ పత్రం ప్రకారం ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తుల పనితీరు వైఫల్యం కారణంగా ఆయన మరణించినట్లు పేర్కొన్నారు. గ్రామంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ టి. రాంబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తల్లాడ, కుర్నవల్లి సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, స్థానిక వార్డు సభ్యులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నూతన మహిళా సమైక్య భవనానికి భూమిపూజ

## గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం : సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్

**ఎల్కతుర్తి, /జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):**



ఎల్కతుర్తి మండలంలోని ఇందిరానగర్ గ్రామంలో నూతన గ్రామ మహిళా సమైక్య భవన నిర్మాణానికి బుధవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్ కొబ్బరికాయ కొట్టి, ముగ్గు వేసి నిర్మాణ పనులను ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీడీవో ఎన్. విజయ్‌కుమార్, ఎంపీఓ కె. కవిత భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు మహిళా సమైక్య భవనం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎల్కతుర్తి ఎంపీడీవో ఎన్. విజయ్‌కుమార్, ఎంపీఓ కె. కవిత, ఎల్కతుర్తి సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, ఉప సర్పంచ్ కోరెల లావణ్య, వార్డు సభ్యులు, గ్రామ వీవో అధ్యక్షురాలు గొర్రె శ్రీలత, గ్రామ సీఏ తాడూరి సుమలత, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అంబాల రమేష్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కడారి రాజారాం, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి తోడ్పడే ఈ భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ఆకాంక్షించారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నోటుబుక్స్ పంపిణీ

## స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత




**కల్లూరు,/ జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):** కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో స్ఫూర్తి ఫౌండేషన్ దాతల సహకారంతో విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చానాయక్ తండా, కల్లవాడు, శాంతినగర్, ఖాన్‌ఖాన్‌పేట, జీడీపల్లి తదితర ఆరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కొక్కరికి ఐదు నోటుబుక్స్ చొప్పున పంపిణీ చేశారు. అలాగే జీడీపల్లి పాఠశాలకు నోటుబుక్స్‌తో పాటు ఒక టేబుల్‌ను కూడా అందజేశారు.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిరీష, వజీర్ మియా చేతుల మీదుగా విద్యార్థులకు నోటుబుక్స్ అందజేయగా, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కల్లూరు ఎంఈఓ శ్రీమతి పత్తిపాటి నివేదిత, స్ఫూర్తి ఫౌండేషన్ కమిటీ సభ్యులు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, మర్రెల వెంకటేశ్వర్లు, ఎస్.కె. ముజీమ్, దేవేందర్, దామల దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

# సూడా చైర్మన్ దుర్గాప్రసాద్‌కు ఘన సన్మానం

## శాలువాతో సత్కరించిన టీడీపీ నాయకుడు నారపోగు ప్రసాద్ బాబు





**వైరా, /జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):**

ఖమ్మం జిల్లా స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సూడా) నూతన చైర్మన్‌గా నియమితులైన పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు వైరా పట్టణంలో ఘన సన్మానం నిర్వహించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని కమ్మవారి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పలువురు రాజకీయ, సామాజిక నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన సత్తుపల్లి నియోజకవర్గ టీడీపీ మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నారపోగు ప్రసాద్ బాబు, స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి సూడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నారపోగు ప్రసాద్ బాబు మాట్లాడుతూ, సూడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దుర్గాప్రసాద్ సమర్థవంతంగా పనిచేసి ఖమ్మం జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణాభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాపా మురళి, కాంపాటి రవి, మొండ్రు రాజు తదితరులు పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సభ ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

## - జిల్లా ధర్మయ్య మాదిగ

**వర్ధన్నపేట/జూన్ 17(జర్నలిస్ట్ వార్త);** బర్తి: మాదిగ, దాని ఉపకులాల విద్యార్థులు చదువుకు దూరం కాకుండా ఉన్నత విద్యా ఉద్యోగాల సాధనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ వర్ధన్నపేట మండల ఇన్‌చార్జి జిల్లా ధర్మయ్య మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని ల్యాబర్తి గ్రామంలో నిర్వహించిన గో టు విలేజ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో డ్రాప్ అవుట్ విద్యార్థులను గుర్తించి, తిరిగి పాఠశాలలు, కళాశాలల్లో చేర్పించాలని కోరారు.



మందకృష్ణ మాదిగ 32 ఏళ్లుగా పోరాడి సాధించిన ఎస్సీ వర్గీకరణ ఫలాలను మాదిగ బిడ్డలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువత విదేశీ విద్య, ఉద్యోగ అవకాశాల వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు, జులై 7న ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ, మండల కేంద్రాలలో జెండా పండుగను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ముత్యాల మల్లేశం మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు చాడ కర్ణాకర్ మాదిగ, మారపెల్లి ఎల్లయ్య మాదిగ, ఉపసర్పంచ్ సంకినేని గంగరాజు మాదిగ, ప్రశాంత్, ఉపేందర్, సురేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి

### విద్యార్థులకు నోట్‌బుక్స్, టెక్స్ట్‌బుక్స్ అందజేత





**భీమదేవరపల్లి/జూన్17 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలం ముత్తారం ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సర్పంచ్ మాట్ల హరికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, ఇతర విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యలో ప్రతిభ కనబరచాలని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఉపాధ్యాయులు అందిస్తున్న మార్గదర్శకత్వాన్ని విద్యార్థులు పాటించాలని సూచించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆయన కోరారు. విద్యార్థుల భవిష్యత్ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రియదర్శిని, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో అనుమతి లేకుండా టేకు చెట్ల నరికివేత.

### -కలప స్వాధీనం చేసుకున్న అటవీ శాఖ అధికారులు.



**బయ్యారం/,జూన్ 17.(జర్నలిస్ట్ వార్త)**
బయ్యారం మండలం సింగారం ఎంపియుపిఎస్ పాఠశాలనందు ప్రధానోపాధ్యాయుడు శంకర్ సంబంధిత అధికారుల అనుమతి లేకుండా టేకు చెట్లను నరికి కార్పెంటర్ ఇంటికి తరలించారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో బయ్యారం ఫారెస్ట్ రేంజర్ రవి కిరణ్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవి శాఖ అధికారులు పాఠశాలలో టేకు చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలించి పాఠశాల హెచ్‌ఎం ను విచారించారు. విచారణ అనంతరం గంధంపల్లి గ్రామంలో కార్పెంటర్ ఇంట్లో నిలువ ఉంచిన టేకు కలపను సీజ్ చేసి డిపోకు తరలించనున్నట్లు డిఆర్ఓ రమాదేవి తెలిపారు. డిఆర్ఓ వెంట బీట్ అధికారి తార ఉన్నారు

## గిరిజనేతరులకు పట్టాలు ఇవ్వాలని అదనపు కలెక్టర్ వినతిపత్రం అందజేత.



**బయ్యారం/,జూన్ 17.(జర్నలిస్ట్ వార్త)**
కొత్తపేట గ్రామపంచాయతీ ధర్మాపురం రెవిన్యూ పరిధిలోని అర్హులైన గిరిజనేతర కుటుంబాలకు భూ పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ కొత్తపేట సర్పంచ్ భూక్యా ప్రవీణ్ నాయక్ జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ కలెక్టర్ తో మాట్లాడుతూ గ్రామ పరిధిలో అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న 80 గిరిజనేతర కుటుంబాలకు ఇప్పటివరకు భూ హక్కుల పత్రాలు మంజూరు కాలేదని,అర్హులైన ప్రతి గిరిజనేతర కుటుంబానికి చట్టబద్ధంగా పట్టాలు మంజూరు చేసి,ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అదనపు కలెక్టర్ సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని ఈ విషయమై సంబంధిత అధికారులతో పాటు ఆర్డీవోతో మాట్లాడి అతి త్వరలోనే సమస్య పరిష్కారిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గట్టు శ్రీనివాస్,చింతనూరి భాస్కర్,పెనుగొండ పుల్లయ్య,సుంకార రామకృష్ణ,దేవినేని రాము,చల్లా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


# సూడా చైర్మన్ అభినందన సభకు భారీ ర్యాలీ

### కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఉత్సాహభరిత పాల్గొనిక

**వైరా, /జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):**
ఖమ్మం జిల్లా స్తంభాద్రి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (సూడా) చైర్మన్‌గా నియమితులైన పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు అభినందనలు తెలియజేస్తూ వైరా నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు.
పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన సూడా చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జెండాలు, నినాదాలతో ర్యాలీ ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, సూడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ,



మున్సిపల్ చైర్‌పర్సన్ కాప చంద్రకళ, కాప మురళీకృష్ణ, వడ్లమూడి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అభినందన సభలో పలువురు నాయకులు మాట్లాడుతూ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్ నాయకత్వంలో సూడా పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం



చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పట్టణాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించారు.

# దామెర గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

### గౌరవ అధ్యక్షులుగా ఉమ్మగోని ప్రభాకర్ గౌడ్, అధ్యక్షులుగా పాటి శ్రీనివాస్ గౌడ్

**ఎల్కతుర్తి,/ జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):**
ఎల్కతుర్తి మండలంలోని దామెర గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గ కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల సమావేశానికి అప్కార్ కోఆపరేటివ్ అధికారి శ్రావణ్ రెడ్డి హాజరై ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. సంఘ గౌరవ అధ్యక్షులుగా ఉమ్మగోని ప్రభాకర్ గౌడ్, అధ్యక్షులుగా పాటి శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యక్షులుగా తండా రమేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా చిర్ర సుధాకర్ గౌడ్ ఎన్నికైనట్లు సభ్యులు ప్రకటించారు.
అదేవిధంగా డైరెక్టర్లుగా మంద (పతాంజలి) రమేష్, మంద చిన్న రాజబాబు, పూదరి కుమారస్వామి, పచ్చిమట్ల సదానందం, తోట రమేష్, ఉమ్మగోని సురేందర్ తదితరులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పాటి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా గౌడ కులస్తుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ సూచనలు, సంఘ సభ్యులు,



సీనియర్ నాయకుల సహకారంతో సంఘ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గౌడ కులస్తులకు చేరవేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం మాజీ అధ్యక్షుడు మంద రవీందర్, మాజీ ఉపాధ్యక్షుడు తండా రాజు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు తోట రవి, తండా మొండయ్య, పాటి కొత్త కుమారస్వామి, తండా కొమురయ్య, ఉమ్మగోని యుగంధర్, మంద రాములు, మంద రవి, చిర్ర చంద్రమౌళి గౌడ్, బాలగౌడ్, వీరస్వామి గౌడ్, శ్రీనివాస్




గౌడ్ (రేవంత్) తదితరులు పాల్గొన్నారు. మంత్రిని త్వరలో కలవనున్న గౌడ సంఘ ప్రతినిధులునూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు త్వరలో తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ను మర్యాదపూర్వకంగా కలవనున్నట్లు అధ్యక్షుడు పాటి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దామెర గ్రామంలోని ఎల్లమ్మ తల్లికంటమయ్య ఆలయ అభివృద్ధితో పాటు గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. గ్రామాభివృద్ధి, సంఘ సంక్షేమం కోసం ప్రభుత్వ సహకారం పొందేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# వంగరలో బాలవికాస్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**భీమదేవరపల్లి/జూన్ 17 (జర్నలిస్ట్ వార్త):** వంగర గ్రామ పంచాయతీ పరిధిలోని పీవీ నగర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలవికాస్ వాటర్ ప్లాంట్‌ను గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో బాలవికాస్ సంస్థ సహకారంతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు స్వచ్ఛమైన తాగునీరు అత్యంత అవసరమని, ఈ ప్లాంట్ ద్వారా పీవీ నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ప్రయోజనం పొందనున్నారని పేర్కొన్నారు.
గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ప్రజల సహకారంతో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని



తెలిపారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన బాలవికాస్ సంస్థ, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ సంస్థ ప్రతినిధులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించే దిశగా ఈ వాటర్ ప్లాంట్ ఒక మైలురాయిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బాలవికాస్ ప్రతినిధి కేడం లింగమూర్తి, ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ ప్రతినిధులు, వార్డు సభ్యులు రఘునాయకుల మహేష్ రెడ్డి, మారం సతీష్, గజ్జల రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగిరెడ్డి సతీష్, వాటర్ ప్లాంట్ కమిటీ సభ్యులు కొండ తిరుపతి, మాజీ సర్పంచ్





రఘునాయకుల వెంకటరెడ్డి, నల్లగోని ప్రభాకర్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురం గ్రామంలో కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో

# ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం.





### -మండల వ్యవసాయ అధికారి కే.రాజు.

**బయ్యారం/,జూన్ 17.(జర్నలిస్ట్ వార్త)**
కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారులు జిల్లా వ్యవసాయ అధికారిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బయ్యారం మండలం లక్ష్మీపురం గ్రామంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐపీఎంసీ ఇంచార్జి వెంకటరెడ్డి మాట్లాడుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రారంభించిన కేతీ బచావో అభియాన్ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించి మట్టిపరీక్ష,పంట మార్పిడి చేసి రసాయన ఎరువులు తగ్గించి భూసారాన్ని కాపాడాలన్నారు.
హొన్నప్ప ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విత్తన శుద్ధి ఉపయోగాలు గురించి చెప్పి డెమో చూపించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఉదయ్ శంకర్ మాట్లాడుతూ పురుగుమందులు పిచికారి చేసేటప్పుడు,కొనేటప్పుడు,వాడిన తర్వాత పాటించ వలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి కే.రాజు,పి.రమేష్,ఏఈఓలు పాల్గొని రైతులు రసాయన ఎరువులు తగ్గించి భూసారాన్ని కాపాడే జనుము,జీలుగ వేసుకోవాలని చెప్పారు. ఈ



కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొర్రా కృష్ణ పాల్గొని రైతులకు మార్గనిర్దేశం చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణి చేసిన ఎంపిడివో.







**బయ్యారం/,జూన్ 17.(జర్నలిస్ట్ వార్త)**
వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బయ్యారం మండలం లక్ష్మీనరసింహాపురం ప్రభుత్వ పాఠశాలను ఎంపీడీవో దీపిక సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పానుగోతు వెంకన్న ఆధ్వర్యంలో ఎంపీడీవో దీపిక చేతుల మీదుగా ఒకటో తరగతిలో ప్రవేశం పొందిన విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించే పాఠ్యపుస్తకాలు,నోట్ బుక్స్ ఎంపీడీవో చేతుల మీదుగా విద్యార్థిని విద్యార్థులకు అందించారు. అనంతరం పాఠశాలను సందర్శించి ప్రహరీ గోడ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని పిల్లలకు సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేదే నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందుతున్న బెనిఫిట్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోహన్,లక్ష్మీ,ఉప్పలయ్య,పంచాయతీ సెక్రటరీ,అంగన్వాడి టీచర్స్ సునీత, విజయ,తదితరులు పాల్గొన్నారు.